తిరుపతి - చిత్తూరు

30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

వర్షాలు కురవాలని

# వరుణయాగం..

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా వరుణజపం



కాణిపాకం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎల్‌నినో ప్రభావం తగ్గాలని, సకాలంలో వర్షాలు కురవాలని, కరువు కాటకాలు లేకుండా ప్రజలు జీవించాలని కోరుతూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ, రాష్ట్ర ప్రభుత్వం అదేశాల మేరకు మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో వరుణయాగం, వరుణజపంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పవిత్ర పుష్కరిణిలో తెల్లవారుజామున వేదపండితులు, రుత్వికులు పుష్కరిణి నీటిలో మునిగి వరుణజపం నిర్వహించారు. అలాగే ఆలయ అలంకార మండపంలో అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని హోమ గుండం వద్దకు పూజా సామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చి హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణికుమార్ శర్మ, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, వసంత, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గంగమ్మ ఆలయంలో .....



తిరుపతి, అక్టోబర్ 6ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు కురవక ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో మంచి వర్షాల కోసం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం వరుణహోమం నిర్వహించారు. ఈ హోమం ఉదయం శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ ప్రారంభించారు. మంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరిపించిన వరుణ హోమం, వరుణ జపంలో ఆలయ అర్చకులతోబాటు 14 మంది వేదపండితులతో శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. రాష్ట్రంలో ,దేశంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు, రైతులకు మేలు కలగాలని ఆకాంక్షి స్తూ వరుణ హోమం, వరుణ జపం చేశారు. వేదపందడితులతో వరుణ హోమం, వరుణ జపం నిర్వహించిన అనంతరం 108 కలశము లతో అమ్మవారికి జలాభిషేకమును శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు ,టిడిపి పరిశీలకుడు నూకసాని బాలాజీ, టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాసులు,బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు,ఎస్వీబిసి ఛైర్మన్ బి. శ్రీధర్ వర్మ, రాష్ట్ర యాదవఅభివృద్ధి కమిటీ ఛైర్మన్ జి,నరసింహయాదవ్, ఆల య కమిటీ ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ ,ఆలయ ఇఒ ఎ.జయకుమార్ ,కూటమి నాయకులు పుష్పావతియాదవ్, కృష్ణయాదవ్, దంపూరి భాస్కర్, నరసింహా,నరేంద్ర, గుం డాల గోపీనాథరెడ్డి, లోకప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విగ్రహాల కళ్యాణి, విజయభాస్కర్ రెడ్డి, జయంత్ కుమార్ శంకర్ రెడ్డి ,భక్తులు పాల్గొన్నారు.

### శ్రీ చెంగాళమ్మ దేవస్థానంలో ....



సూళ్లూరుపేట, అక్టోబర్ 6 ప్రభాతవార్త:

శ్రీ చెంగాళ మాతా పరమేశ్వరి దేవ స్థానంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వరుణ యాగాన్ని శాస్త్రోక్తం గా మంగళవారం నిర్వహించారు. దేవస్థాన అర్చకులు హరి కుమార శర్మ ఆధ్వర్యంలో పండితుల బృందం వేదమంత్రాలతో దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో ఉదయం యాగాన్ని ప్రారంభించి మధ్యాహ్నం పూర్ణాహుతితో యాగాన్ని ముగించారు. ఈ సందర్భంగా వేద పండితులు వరుణ శత అణువ కపరిణామాలు, వరుణ జపం చేపట్టారు. ఇద్దరు పండితులు పెద్దదబరాలలో నింపిన నీటిలో కూర్చొని భక్తి శ్రద్ధలతో వరుణ జపాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి ప్రసన్న, ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ ఎస్సి ఎస్ ఛైర్మన్ ఏజ్ కిషోర్, అభివృద్ధి కమిటీ సభ్యులు అలవల శ్రీనివాసులు, పోలూరు బాలసుబ్రమణ్యం, వేమన బోయిన సుబ్రహ్మణ్య యాదవ్,

# మళ్ళీ రెండు గరుడసేవలు

## -16న బ్రహ్మోత్సవానికి -26న పౌర్ణమి సేవ



తిరుమల, అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:

ఈనెలలో మళ్ళీ రెండుసార్లు వేంకటేశ్వర స్వామి గరుడవాహన సేవ వీక్షించే భాగ్యం కలగనుంది. ఈ నెలలోకూడా తిరుమలలో మలయప్పస్వామి గరుడ వాహనంపై రెండుసార్లు అభయమివ్వనున్నారు. 16న శుక్రవారం రాత్రి నవరాత్రి బ్రహ్మోత్స వాల వేళ, తిరిగి 26వతేదీ సోమవారం పౌర్ణమిఘడియల్లో గరుడవాహనం ఊరేగింపు జరగనుంది. 108 వైష్ణవ దివ్య దేశాలలో గరుడ వాహన సేవకు ఎంతో పవిత్రమైన స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు పరమ భక్తుడు, వాహనమైన గరుడుడు వేద స్వరూపానికి, ఆధ్యాత్మిక జ్ఞానానికి వైరాగ్యానికి ప్రతీక. తనను సంపూర్ణ విశ్వాసంతో శరణు కోరిన భక్తులకు భగవంతుడు అందించే అపారమైన అనుగ్రహానికి ఈ సేవ నిదర్శనమని పండితులు చెబుతుంటారు.

డిఐజి హోదాలో

# పోలీస్ కమిషనర్ !







## -తిరుపతి,తిరుమల,శ్రీకాళహస్తి,శ్రీసిటీ జోన్లు

## -అదనపు కమిషనర్‌తోనే పాలన -ప్రతి జోన్‌కు ఒక అడిషనల్ డిసిపి

ప్రభాతవార్త–తిరుపతి:

తిరుపతి యాత్రాస్థలంగానేక పుణ్యక్షేత్రంగా కూడా అంతర్జాతీయంగా ఖ్యాతిచెందడంతో పోలీస్ వ్యవస్థ మరింత బలోపేతం చేసేదిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే తిరుపతిని పోలీస్ కమిషనరేట్‌గా ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే డిఐజి హోదాలో అదనపు పోలీస్ కమిషనర్‌తోనే పోలీస్ పరిపాలన సాగనుంది. ఆయన క్రింద ముగ్గురు డిసిపిలు(ఎస్పి హోదాలో), నలుగురు నాన్ కేడర్ ఎస్పీలు అదనపు డిసిపిలుగా,మరికొందరు ఎసిపిలుగా డిఎస్పీలు హోదాలు మారనున్నాయి. అయితే సిబ్బంది సంఖ్యమాత్రం పెరగకపోతే కమిషనరేట్ అయినా ఇబ్బందులు తప్పవనేది పోలీసువర్గాల్లో వినిపిస్తున్న వాదనలు.గతంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఒకే ఎస్పీ క్రింద పరిపాలన జరిగినా తిరుపతి,శ్రీకాళహస్తి,తిరుమల వంటి పుణ్యక్షేత్రాలు భద్రతకు ప్రాధాన్యత అంతంతమాత్రమే. తిరుపతి విస్తరించడం, జనాభా పెరగడంతో శాంతిభద్రతల పరిరక్షణతోబాటు నేరాలనియంత్రణ, ప్రముఖుల భద్రతతో పోలీస్ అర్బన్ జిల్లా అవసరం ఏర్పడింది. 2010 జూన్ 8న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ ఉత్తర్వు తిరుపతి పోలీస్ అర్బన్ జిల్లా ప్రతిపాదనలు విడుదల చేసింది, 2016లోఅర్బన్ పోలీసు జిల్లాగా కార్యకలాపాలు మొదలయ్యాయి. తిరుమల, తిరుపతి తూర్పు, తిరుపతి పశ్చిమం, రేణిగుంట శ్రీకాళహస్తి సబ్‌డివిజన్లు అర్బన్ జిల్లా క్రిందకు చేరాయి. 2022లో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తిరుపతిని పూర్తి స్థాయి రెవెన్యూ జిల్లాగా మార్చారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖగా రూపాంతరం చెందింది. ఎస్పీ హోదాలో నడుస్తున్న జిల్లా పోలీస్‌శాఖను రానున్న రోజుల్లో డిఐజి అధికారి హోదాలో పాలన సాగనుంది.

**-పోలీస్ కమిషనరేట్‌గా ఏర్పాటు:**

యాత్రాస్థలం తిరుపతి పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు దిశగా సిద్ధమైంది. కొత్త సబ్‌డివిజన్లు, సర్కిళ్ళు, మరికొన్ని మండలాలు, నియోజకవర్గ కేంద్రాలు ప్రాంతాలు కమిషనరేట్ పరిధిలోకి చేరనున్నాయి. నాలుగుజోన్లుగా తిరుపతి,తిరుమల,శ్రీకాళహస్తి, శ్రీసిటీ కమిషనరేట్ పరిధికి రానున్నాయి. డిఐజి హోదాలో తొలి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఎవరికనేది ఇప్పుడు చర్చ మొదలైంది. డిప్యూటీ కమిషనర్స్ ఆఫ్ పోలీస్ హోదాలో ఐపిఎస్ అధికారులు రానున్నారు. వారికి సహాయకులుగా ఇద్దరు నాన్‌కేడర్ ఎస్పీలు డిసిపి పోస్టులు భర్తీచేయనున్నారు. తిరుపతి కమిషనరేట్ పరిధిలోనూ మరిన్ని కొత్త పోలీస్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది.తిరుపతి జిల్లాలో ప్రధానంగా తిరుమల శ్రీవారి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి కాళహస్తీశ్వరస్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, పెద్దపారిశ్రామిక వాడ సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ ఉండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుపతి తిరుమలకు ప్రతిరోజూ లక్షమంది వరకు యాత్రికులు వస్తుండటం,ముఖ్యంగా కేంద్ర,రాష్ట్ర మంత్రులు, న్యాయాధికారులు, ప్రముఖులు, విదేశాల నుండి ప్రముఖులు పర్యటిస్తుండటంతో వారికి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు అదనపు పోలీస్ బలగాలు అవసరం ఉంది.

# వీర జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

## అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు





చిన్నగొట్టిగల్లు, అక్టోబర్ 6 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలంలోని టి.కుమ్మరపల్లికి చెందిన 34 ఏళ్ల ఆర్మీ జవాన్ రెడ్డి బాషా అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. 12 ఏళ్లుగా ఆర్మీలో సేవలందిస్తున్న ఆయన ఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆర్మీ అధికారులు సోమవారం రాత్రి పార్థివదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని టి.కుమ్మరపల్లికి చేరుకుని జవాన్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి ప్రభుత్వం, తనవంతుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జవాన్ మృతివార్త తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం 12 ఏళ్లపాటు సేవలందించిన జవాన్ మృతితో గ్రామం విషాదంలో మునిగిపోయింది. అనంతరం ఆర్మీ సైనికుల ఆధ్వర్యంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను

# ప్రారంభించిన జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 06 ప్రభాతవార్త :

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే ప్రాథమిక వైద్య సేవలు, ముందస్తు నివారణోపాయాలు అవసరమైన హెల్త్ స్క్రీనింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన 267 విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ వైద్య విద్య శాఖల మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ మంగళవారం గుడివాడ నియోజకవర్గంలో నిర్వహించిన ముఖ్య కార్యక్రమంలో వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ భవనాల నిర్మాణాలను జాతీయ ఆరోగ్య మిషన్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం , ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ , 15వ ఆర్థిక సంఘం నిధుల భాగస్వామ్యంతో పూర్తి చేశారు. రాష్ట్రస్థాయి ప్రారంభోత్స వంలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పాల్గొని, తిరుపతి జిల్లా పరిధిలోని 4 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం బి.వి.పురం ఆకృతి విలేజ్ హెల్త్ క్లినిక్స్, వెంకటగిరి నియోజకవర్గం సంగనపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్, గూడూరు నియోజకవర్గం దుగ్గరాజుపట్నం విలేజ్ హెల్త్ క్లినిక్ లు ప్రారంభించారు. . ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆర్. చెంచయ్య నాయుడు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ విసి హాల్ నందు జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్, డిపిఆర్ఈఓ డి. మధుసూదన , వైద్య ఆరోగ్య శాఖ , పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడికి చేరువలో నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# అగ్నిప్రమాదంలో బేకరీ దగ్ధం..



కుప్పం, అక్టోబర్ 6 ప్రభాతవార్త

స్థానికంగా గుడుపల్లె రోడ్డులోని మ్యాక్స్ బేకరీలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమా దం సంభవించింది. దీంతో బేకరీ మొత్తం దగ్ధం కావడంతో దాదాపు పాతిక లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈసంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని నాయనూరుకు చెందిన బాలాజీ అనే వ్యక్తి గుడుపల్లె రోడ్డులో భవనాన్ని లీజుకు తీసుకుని బేకరీ వ్యాపారం చేస్తున్నాడు. అయితే ఏం జరిగిందో తెలియదు గానీ సోమవారం అర్ధరాత్రి మూడు గంటల ప్రాంతంలో బేకరీనుంచి మంటలు రావడంతో యజమానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. యజమాని బాలాజీ ఫైర్ అధికారులకు ఫోన్ చేయగా వారు వచ్చి మంటలు అదుపు చేసే లోపే బేకరీ దాదాపు దగ్ధమైంది. బేకరీలోని ఫ్రిడ్జులు, మెషినరీ, గ్రైండర్లు, కూలర్, గ్లాస్ షోకేస్, ఫర్నీచర్, టువీలర్, రా మెటీరియల్ తదితరాలు దగ్ధం కావడంతో పాతికలక్షలకు పైబడి నష్టం కలిగినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే ఈ ప్రమాదం షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిందా లేక ఇతర కారణమా అనేది తేలాల్సి ఉంది.

# గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వైద్య సదుపాయాలు మరింత బలోపేతం

## - వర్చువల్ విధానంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ప్రారంభించిన రాష్ట్ర వైద్యశాఖ మంత్రి



చిత్తూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వైద్య సదుపాయాలు మరింత బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం పక్కాగా అడుగులు వేస్తోందని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా గుడివాడ నియోజకవర్గం జనార్ధనపురంలో వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం జిల్లాలోని 8 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు మరింత చేరువ చేయడంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కీలకంగా నిలుస్తాయన్నారు. ప్రజలు తమ గ్రామాలకు సమీపంలోనే అందుబాటులో వున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లాలోని జిడినెల్లూరు మండలం తుంగుంద్రం బుక్కపట్నం విలేజ్ హెల్త్ క్లినిక్, పెనుమూరు మండలం సిఆర్ కండ్రిగ విలేజ్ హెల్త్ క్లినిక్, ఎస్ఆర్ పురం మండలం ఆరిమాకులపల్లి సెట్టివానత్తం విలేజ్ హెల్త్ క్లినిక్, కుప్పం మండలం పైపాళ్యం కృష్ణదాసనపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్, కుప్పం మండలం ఎన్.కొత్తపల్లి మంకలొడ్డి విలేజ్ హెల్త్‌క్లినిక్, విజయపురం మండలం కోసల నగరం విలేజ్ హెల్త్ క్లినిక్, గంగవరం మండలం కీలపట్ల విలేజ్ హెల్త్‌క్లినిక్, వి.కోట మండలం ఒగు వెంకటగిరి కోట–1 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలో పోటీకి మార్గదర్శకాలు

## -నామినేషన్‌కు ఇవే కీలక పత్రాలు



ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో మంగళవారం ముత్యాలరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తిరుపతి రూరల్ పోలీసులు.

తిరుపతి రూరల్, అక్టోబర్ 6 ప్రభాతవార్త :

పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్పంచ్ గానీ వార్డు సభ్యులుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు సమర్పించాల్సిన పత్రాలపై అధికారులు స్పష్టత ఇచ్చారు. నామినేషన్ ప్రక్రియలో ఏ చిన్న లోపం ఉన్నా అభ్యర్థిత్వం తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉన్నందున పూర్తి జాగ్రత్తలు అవసరమని సూచిస్తున్నారు. నామినేషన్ దాఖలు చేయాలంటే ముందుగా ఫారమ్‌ను సరిగ్గా నింపి, అభ్యర్థి ప్రతిపాదకుడు సంతకాలు చేయాలని, అలాగే సంబంధిత గ్రామ పంచాయతీ వార్డు ఓటరు జాబితాలో అభ్యర్థి, ప్రతిపాదకుని పేర్లు ఉన్నట్లు నిర్ధారించే పేజీ నకలు తప్పనిసరిగా ఉండాలి. 21 సంవత్సరాలు నిండినట్లు 10వ తరగతి సర్టిఫికేట్, జనన ధ్రువీకరణ పత్రం ఆధార్ ద్వారా నిరూపించాలి. రిజర్వ్‌డ్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు తహశీల్దార్ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు సమర్పించాల్సిన అఫిడవిట్లు కూడా కీలకం. ఆస్తులు, అప్పులు, నేర చరిత్ర వివరాలతో స్వయం అఫిడవిట్ ఇవ్వాలి. కుటుంబ నియంత్రణ నిబంధనల ప్రకారం పిల్లల సంఖ్యపై డిక్లరేషన్ సమర్పించాలి. ఎన్నికల ఖర్చుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఓ బ్యాంకు ఖాతా తెరిచి దాని వివరాలను ఇవ్వడం తప్పనిసరి. ఇక గ్రామపంచాయతీకి ఎటువంటి బకాయిలు లేవని నిర్ధారించే నో అబ్జక్షన్ సర్టిఫికెట్ కూడా పొందాలి. అభ్యర్థులు తాజా ఎన్నికల నోటిఫికేషన్ సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి, సంబంధిత రిటర్నింగ్ అధికారి వద్ద పూర్తి వివరాలు ధృవీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# కాల్ సెంటర్లను బలోపేతం చేయాలి

## -విద్యుత్ ప్రమాదాలను నిరోధించేందుకు చర్యలు -మంత్రి గొట్టిపాటి రవికుమార్




తిరుపతి,అక్టోబర్ 6ప్రభాతవార్త:

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎపిఎస్పిడిసిఎల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రూఫ్ టాప్ సోలార్ పనులను సకాలంలో పూర్తి చేయాలని, పనుల్లో నిరక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ పంపిణీ సంస్థల్లో విద్యుత్ వినియోగదారుల సేవాకేంద్రం (1912)ను బలోపేతం చేయాలని మంత్రి గొట్టిపాటి అధికారులకు సూచించారు. వినియోగదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యుత్ సమస్యలు సత్వరం పరిష్కారం అయ్యే విధంగా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ ప్రక్రియలో వినియోగదారులకు సకాలంలో సమాచారం అందే విధంగా అధికారులు అసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్పిడిసిఎల్ పరిధిలో కారుణ్య నియామకాల కింద 46 మందికి ఉద్యోగల నియామక పత్రాలను మంగళవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఎస్పిడిసిఎల్ పరిధిలో కారుణ్య నియామకాల ప్రక్రియలో భాగంగా గత యేడాది డిసెంబరు 22న 50 మందికి, ఈ యేడాది ఏప్రిల్ 24న 18 మందికి, తాజాగా నేడు మరో 46 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎపిఎస్పిడిసిఎల్లో 215 మందికి కారుణ్యనియామకాల కింద ఉద్యోగ అవకాశాలను కల్పించామని వివరించారు. విద్యుత్ ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ సంస్థను మరింత అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేయాలని కోరారు.

